బిందెలతో నీరుపోసి.. వినూత్న నిమజ్జనం



బిందెలతో నీరుపోస్తూ.. నిమజ్జనం చేస్తున్న మహిళలు

ఘట్‌కేసర్: పట్టణంలోని బాలాజీ హోమ్స్‌ కేవిల్లార్‌ కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపం నిర్వాహకులు శనివారం వినూత్నంగా నిమజ్జనం చేశారు. మండపంలో ప్రతిష్ఠించిన మట్టి వినాయకుడిని మండపం ముందే గుంత తీసి కాలనీలోని ప్రతి ఇంటి నుంచి బిందె నీరు తీసుకొచ్చి ఉన్నచోటే నిమజ్జనం చేశారు. అనంతరం మట్టిని ఇంటింటికి పెంచిపెడతామని తెలిపారు. కాలనీ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, వెంకటేష్‌, గోపిగుప్తా, ఆంజనేయులు, శ్రీరాంరెడ్డి, సతీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

భారత్‌ బైబిల్‌ కాలేజ్‌ కమిటీ సమావేశం

మేడ్చల్: ఎల్లంపేట్‌ మున్సిపాలిటీ పరిధి డబిల్‌పూర్‌లోని భారత్‌ బైబిల్‌ కాలేజ్‌, నాజరెన్‌ గ్రామర్‌ హైస్కూల్‌ సొసైటీల సమావేశం శనివారం నిర్వహించారు. క్రైస్తవ మిషనరీలతో కాలేజీలు, స్కూళ్లు ఏర్పాటు చేసినట్లు సభ్యులు వివరించారు. సొసైటీలో అక్రమాలకు పాల్పడిన వారి అనుచరులను సొసైటీ నుంచి తొలగించుటకు తీర్మానం చేసి వారికి నోటీసులు జారీ చేసినట్లు స్పష్టం చేశారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ప్రేరణ ప్రతిభ డాన్స్‌ ఇన్స్టిట్యూట్‌ గురువు అమీకుమార్‌ శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఓం గణనాథాయ, బ్రహ్మాంజలి, దేవదేవం తదితర అంశాలను కళాకారులు నయోనికా, సంహిత, హర్షిని, లహరి, జాన్వీ, కృష్ణ తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

లయన్స్‌ డిస్ట్రిక్‌ వైస్‌ గవర్నర్‌గా అశోక్‌కుమార్‌

కాప్రా: లయన్స్‌ క్లబ్‌ డిస్ట్రిక్‌ ఫస్ట్‌ వైస్‌ గవర్నర్‌గా లయన్‌ ఆశోక్‌కుమార్‌ స్పైన్‌ నియామితులయ్యారు. 5న జరిగిన ఎన్నికల్లో 90 శాతం ఓట్లతో ఆయన ఎన్నికయ్యారు. డిస్టిక్‌ సెకండ్‌ వైస్‌ గవర్నర్‌గా లింగారెడ్డిని ప్రకటించారు. ఈ విషయాన్ని శనివారం లయన్స్‌ క్లబ్‌ ప్రతినిధులు అధికారికంగా ప్రకటించారు. అదనపు డిస్టిక్‌ కేబినెట్‌ సెక్రటరీ కొత్తపల్లి రాంబాబు, ఇతర ప్రతినిధులు కమలాకర్‌, ముత్యాలు, యాదగిరిరెడ్డి, రవీందర్‌నాథ్‌గుప్తా, జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మం శక్తివంతమైనది

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు



రాంచంద్రరావును సన్మానిస్తున్న ఉత్సవ సమితి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్‌

రామంతాపూర్ : హిందూ ధర్మం మహాశక్తివంతమైనదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు అన్నారు. శనివారం రామంతాపూర్‌ ప్రధాన రహదారి దూరదర్శన్‌ కేంద్రం వద్ద భాగ్యనగర్‌ గణేష్‌ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుల స్వాగత వేదికకు ఆయన హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. అనాధిగా హిందూధర్మంపై పలు విదేశీ శక్తులు దాడులు చేసి నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించారని, కానీ మన ధర్మం చెక్కు చెదరకుండా గంగానది వలే నిరంతరం ప్రవహిస్తోందన్నారు. గణేష్‌ ఉత్సవాల్లో హిందువులంతా ఏకమై నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయడం హిందూ ధర్మ ఐక్యతకు నిదర్శనమన్నారు. ప్రధాని మోదీ సూచన మేరకు ప్రజలంతా స్వదేశీ వస్తువులనే కొనడానికి ఆసక్తి చూపాలని ఆయన కోరారు. స్థానికంగా భాగ్యనగర్‌ గణేష్‌ ఉత్సవ సమితి చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను ఆయన ప్రశంసించి అభినందించారు. భాగ్యనగర్‌ ఉత్సవ సమితి రామంతాపూర్‌ విభాగ వ్యవస్థాపక అధ్యక్షుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌, ధర్మారెడ్డి, ఆర్‌వీ.శేఖర్‌, ఎల్లాచారి, సోమ శ్రీనివాస్‌ తదితరులున్నారు.

దుర్వాసనతో అవస్థలు !



సర్వీస్‌ రోడ్డుపైనే డ్రైనేజీ ప్రవాహం

సర్వీస్‌ రోడ్డుపై పొంగుతున్న డ్రైనేజీ

- ముగురుతో ఇబ్బందిపడుతున్న ప్రజలు
- మరమ్మతులు చేయాలని స్థానికుల విజ్ఞప్తి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో విలీనం అనంతరం గ్రామాల్లో పారిశుద్ధ్యం, డ్రైనేజీ పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. మున్సిపాలిటీలో చేరిన తర్వాత అధికారులు గ్రామాల్లోని సమస్యలు గాలికి వదిలేశారు. మున్సిపాలిటీ ప్రత్యేక అధికారుల పాలన కంటే పంచాయతీ పాలనేనయమన్న అభిప్రాయం ప్రజలు వ్యక్తమవుతోంది.

ఫిర్యాదులు గాలికి...

అవుషాపూర్‌ జగత్‌స్వప్న కాలనీ వద్ద సర్వీస్‌ రోడ్డులో రెండు నెలలుగా డ్రైనేజీ నిండి పొంగిపొర్లుతుంటే పట్టించుకునేవారే కరువయ్యారు. దీంతో గ్రామంలో ఒక సర్వీస్‌ రోడ్డు నుంచి మరో సర్వీస్‌ రోడ్డుకు వెళ్లాలంటే అండర్‌పాస్‌ రోడ్డు దాటాలి. గ్రామంలోని వ్యర్థాలతో డ్రైనేజీ నిండి బయటకురావడంతో అండర్‌పాస్‌ రోడ్డు, సర్వీస్‌ రోడ్డు మురికికూపంగా మారింది.

భరించలేని దుర్వాసన...



అవుషాపూర్‌ సర్వీస్‌ రోడ్డు పక్కన పొంగుతున్న డ్రైనేజీ

రెండు నెలలుగా సర్వీస్‌ రోడ్డు పక్కనే భరించలేని దుర్వాసన వస్తుందని వార్డు అధికారి, మున్సిపల్‌ కార్యలయంలో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే కాలయాపన చేస్తున్నారని, ఈ స్థలంలో వాహనం అదుపు తప్పితే డ్రైనేజీలో పడాల్సిందేనంటున్నారు. పాదచారులు అండర్‌ పాస్‌రోడ్డు, సర్వీస్‌ రోడ్డు మీదుగా రాకపోకలు రెండు నెలలుగా మరిచిపోయారు. డ్రైనేజీ సమస్య తెలియని స్థానికేతరులు సర్వీస్‌ రోడ్డులో ఉన్న మురికితో ప్రయాణం చేయలేక, మరో దారిలేక నరకం అనుభవిస్తున్నారు. వరద నీటితో పాటు డ్రైనేజీ ప్రవహిస్తుండటంతో రోడ్డంతా కుంటల దర్శనమిస్తున్నాయి.

మొదటి నుంచి సమస్యాత్మకమే...

జాతీయ రహదారిపై అవుషాపూర్‌ వద్ద నిర్మించిన అండర్‌ పాస్‌ రోడ్డు మొదటి నుంచి సమస్యాత్మకమే. వర్షాకాలం నీటితో అడుగు వేయలేని విధంగా ఉంటుంది. దీనికి తోడు డ్రైనేజీ రోడ్డుపై పారుతుండటంతో ముక్కు మూసుకుని ప్రయాణించాల్సి వస్తుంది. సర్వీస్‌ రోడ్డులో అండర్‌ పాస్‌ వద్ద డ్రైనేజీ సమస్యకు శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు..

సర్వీస్‌ రోడ్డుపై ప్రయాణించాలంటేనే ప్రజలు జంకుతున్నారు. వాహనం అదుపు తప్పితే అంతే సంగతులని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలపై అధికారులు స్పందన ఇలాగేనా..? అంటూ.. గ్రామస్తులు, ప్రయాణికులు అధికారులపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవుషాపూర్‌ సర్వీస్‌ రోడ్డు వద్ద నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రెండు నెలలైనా పరిష్కారం కావడం లేదు



అవుషాపూర్‌ సర్వీస్‌ రోడ్డులో డ్రైనేజీ సమస్యపై ఫిర్యాదు చేసి రెండు నెలలైనా సమస్యకు పరిష్కారం లభించలేదు. ప్రయాణికులు, స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

– ఏనుగు మహేందర్‌రెడ్డి, అవుషాపూర్‌

మున్సిపల్‌ అధికారులు స్పందించాలి.



ప్రజా సమస్యలపై మున్సిపల్‌ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దుర్వాసన కారణంగా సర్వీస్‌ రోడ్డులో ప్రయాణించాలంటే భయం వేస్తోంది. డ్రైనేజీ సమస్యపై మున్సిపల్‌ అధికారులు స్పందించాలి.

– మహేష్‌, అవుషాపూర్‌

సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలి



అవుషాపూర్‌ సర్వీస్‌ రోడ్డులో అండర్‌ పాస్‌ నిర్మించినప్పటి నుంచి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వరద నీరు ఓ వైపు, డ్రైనేజీ దుర్గంధం మరో వైపు ఊపిరి తీసుకోలేకపోతున్నాం. శాశ్వత ప్రాతిపదికన సమస్యను పరిష్కరించాలి.

– భాను, అవుషాపూర్‌

శాశ్వతంగా పరిష్కరిస్తాం..



అండర్‌ పాస్‌ రోడ్డు వద్ద వరద నీటి సమస్యపై జాతీయ రహదారుల అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తాం. వాటికి ప్రత్యేక నిధులు అవసరం. డ్రైనేజీ సమస్యను కూడా పరిష్కరిస్తాం.

– రాజేష్‌, మున్సిపల్‌ కమిషనర్‌ ఘట్‌కేసర్‌

నిమజ్జనాలపై ప్రత్యేక దృష్టి

17 చెరువుల వద్ద ప్రత్యేక అధికారుల నియామకం

సాక్షి,మేడ్చల్‌ జిల్లా: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 17 చెరువు వద్ద గణేష్‌ నిమజ్జన కార్యక్రమం వైభవంగా జరిగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం అన్ని సౌకర్యాలను కల్పించారు. శనివారం వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు.

◆ ఒక్కో చెరువు వద్ద రెండు క్రేన్లు ఏర్పాటు చేయడంతో పాటు ఇద్దరు గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచారు. ప్రత్యేక అధికారులుగా మున్సిపల్‌ కమిషనర్లు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్లు, తహసీల్దార్లకు జిల్లా కలెక్టర్‌ మను చౌదరి బాధ్యతలు అప్పగించారు. జిల్లా అదనపు కలెక్టర్లు, డీఆర్‌ఓ, ఆర్డీఓలు స్పెషల్‌ ఆఫీసర్లు నిరంతరం పర్యవేక్షించారు.

◆ చివరి రోజైన శనివారం భక్తులు 4 వేల వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు అధికార వర్గాలు ప్రకటించాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 3 ఫీట్ల నుంచి మొదలుకుని 5 ఫీట్లకు పైగా వినాయక విగ్రహాలు దాదాపు 38,477 ప్రతిష్ఠించినట్లు అధికార యంత్రాంగం అంచనా. గతేడాది 17 చెరువుల్లో 36,456 వినాయక విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేశారు.

అన్నదానం



పోచారం: ముత్వెల్లిగూడలోని డ్రీమ్‌హోమ్‌ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కాలనీవాసులు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. కాలనీకి చెందిన మహిళలు ధనలక్ష్మి, అరుణ, సుష్మ, ఉదయశ్రీ, రాధిక, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



పెద్దచెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ అవినాష్‌మహంతి

శామీర్‌పేట్: గణపతి నిమజ్జన ఏర్పాట్లను పెద్దచెరువు వద్ద సైబరాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌ అవినాష్‌ మహంతి సందర్శించారు. శనివారం తూంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేట పెద్దచెరువు వద్ద ఆమె ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జనాలు సజావుగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ఏర్పాట్లపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మేడ్చల్‌ డీసీపీ కోటిరెడ్డి, డీసీపీ వేంకటేశ్వర్లు, ఏసీపీ బాలగంగిరెడ్డి, ఇన్‌స్పెక్టర్‌ శ్రీనాథ్‌, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ వార్డు సభ్యుడి మృతి



అంజయ్యగౌడ్‌

పోచారం: యంనంపేటకు చెందిన మాజీ వార్డు సభ్యుడు పోలగోని అంజయ్యగౌడ్‌ అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. బంధువులు, గ్రామస్తుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు పూర్తి చేశారు.

9 నుంచి కాప్రా–కీసర జోనల్‌ క్రీడా పోటీలు



జోనల్‌ సెక్రటరీ మన్మోహన్‌

కీసర: 69వ స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో కాప్రా–కీసర జోనల్‌ స్థాయి ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాల విద్యార్థినీవిద్యార్థులకు చీర్యాలలోని డివైన్‌ గ్రేస్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌లో ఈనెల 9 నుంచి 11 వరకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్‌ పోటీలు నిర్వహిస్తున్నట్లు జోనల్‌ సెక్రటరీ మన్మోహన్‌ ప్రకటించారు. 9న అండర్‌–14, 17 బాలురకు ఖోఖో పోటీలు, బాలికలకు కబడ్డీ, వాలీబాల్‌ పోటీలు, 10న అండర్‌–14,17 బాలురకు వాలీబాల్‌, కబడ్డీ పోటీలు, అండర్‌–14,17 బాలికలకు ఖోఖో పోటీలు, 11న మిగిలిన ఆటలు, అనంతరం బహుమతి ప్రదానం ఉంటుందని ప్రకటించారు. పోటీల్లో పాల్గొనే జట్లు 8న జట్ల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9440880447.

యోగాతోనే మానసిక ప్రశాంతత



యోగా అకాడమీని ప్రారంభించిన మాజీ చైర్మన్‌ కొండల్‌రెడ్డి

పోచారం: క్రమం తప్పకుండా యోగాభ్యాసం చేయడం ద్వారా మనలోని ఒత్తిడి, మానసిక ఆందోళన తగ్గుతాయని మాజీ చైర్మన్‌ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. శనివారం అన్నోజిగూడలోని సాయినగర్‌లో వన్‌ మంత్ర యోగా, వెల్‌నెస్‌ అకాడమీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏకాగ్రత, మానసిక ప్రశాంతతకు యోగాభ్యాసం చేయాలన్నారు. గుండె ఆరోగ్యాన్ని, జీర్ణక్రియను మెరుగుపరుచుకోవడానికి యోగా ఓ ఉత్తమ సాధన అన్నారు. సౌత్‌ ఇండియన్‌ అచీవర్స్‌ అవార్డు అందుకున్న యోగా గురువు రమ్య చక్రవర్తి నిర్వహణలో యోగా సెంటర్‌ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం యోగా గురువు రమ్య చక్రవర్తి మాట్లాడుతూ.. థైరాయిడ్‌, ఆస్తమా, పీసీఓడీ, మైగ్రేన్‌, సైనస్‌, ఓటీసిటీ, నిద్రలేమి, హార్మోన్ల అసమతుల్యత, ఒత్తిడి నిర్వహణ, గర్భధారణ, లామేజ్‌ టెక్నిక్‌, వంధత్వం, మలబద్ధకం వంటి సమస్యలను యోగాతో నివారించుకోవచ్చని సూచించారు. నిర్వాహకులు సంతోష్‌, సుధాకర్‌, యోగా విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జనం.. ఉత్సాహంగా లడ్డూ వేలం



నిమజ్జనానికి జైమాత యూత్‌ వినాయకుడు



చెన్నాపూర్‌లో ప్రత్యేక పూజల్లో ఎంపీ ఈటల రాజేందర్‌



ఏదులాబాద్‌ చెరువు వద్ద

జవహర్‌నగర్: కార్పొరేషన్‌ పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం చెన్నాపూర్‌ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఎంపీ ఈటల రాజేందర్‌ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌, మాజీ కార్పొరేటర్‌ లావణ్యసతీష్‌గౌడ్‌, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహేందర్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపూర్‌, నాడెం చెరువులో శనివారం నిర్వహించిన వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. నారపల్లి, అన్నోజిగూడ, పోచారం, వెంకటాపూర్‌, కొర్రెముల్‌, రాజీవ్‌ గృహకల్ప, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, యంనంపేట్‌, ప్రతాపసింగారం, కాచవానిసింగారం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల నుంచి వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తీసుకొచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిమజ్జనం కొనసాగింది.

కీసర: నాగారం, రాంపల్లిలో జైమాత యూత్‌ ఆధ్వర్యంలో వినాయకుడి నిమజ్జనం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వినాయకుడి లడ్డూను ప్రసాద్‌గౌడ్‌ రూ.2,11,012కు వేలంలో దక్కించుకున్నాడు.

ఘట్‌కేసర్: పట్టణంలోని కొండాపూర్‌ సింగరేణి గణేష్‌ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణపతి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. శనివారం గాజుల సరళాశ్యామ్‌సుందర్‌రెడ్డి రూ.2,35,000లు, గుండా లక్ష్మణ్‌ కుటుంబసభ్యులు రూ. 2,51,000లు పాడి లడ్డూను కైవసం చేసుకున్నారు.

◆ ఏదులాబాద్‌ వినాయకసాగర్‌ (శ్రీలక్ష్మీనారాయణ చెరువు)లో వేలాదిగా భక్తులు వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తీసుకొచ్చారు. శనివారం నిమజ్జన ఏర్పాట్లను ప్రత్యేక అధికారి మున్సిపల్‌ కమిషనర్‌ రాజేష్‌ ఆధ్వర్యంలో సమీక్షించారు. నిమజ్జనం కోసం చెరువు వద్ద మూడు భారీ క్రేన్లను ఏర్పాటు చేశారు.

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి, ఎల్లంపేట్‌ మున్సిపాలిటీల పరిధిలోని పలు గ్రామాల్లో గణేష్‌ నిమజ్జన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పలు వినాయకమండపాల వద్ద నిర్వహించిన లడ్డూ వేలంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొని లడ్డూను కైవసం చేసుకునేందుకు పోటీ పడ్డారు.

◆ పట్టణంలోని రాఘవేంద్రనగర్‌ కాలనీలో లడ్డూ వేలంలో రూ.1,11,116 రాజేశ్వరీ అపార్ట్‌మెంట్‌ వాసులు దక్కించుకోగా.. అదే కాలనీలోని మరో మండపం వద్ద రూ.1,15116కు మహిపాల్‌రెడ్డి అనే వ్యక్తి లడ్డూ కై వసం చేసుకున్నాడు. పూడూర్‌ గ్రామంలోని పలు వినాయక మండపాల వద్ద నిర్వహించిన వేలం పాటలో లడ్డూలు రూ. లక్షకు పైగా ధర పలికాయి.



మేడ్చల్‌ రాఘవేంద్రనగర్‌ కాలనీలో లడ్డూతో కాలనీవాసులు



పూడూర్‌లో ఆకట్టుకున్న గణపయ్య హారతి



ఘట్‌కేసర్‌ ఈడబ్ల్యూఎస్‌ కాలనీలో..



లడ్డూను స్వీకరిస్తున్న సరళాశ్యామ్‌సుందర్‌రెడ్డి దంపతులు